ABN
ఆంధ్రజ్యోతి

విద్యుత్ చార్జీలు పెంచడం లేదు

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ.. టీజీఈఆర్సీ బహిరంగ విచారణలో వెల్లడి

- పలు ఫిర్యాదులు స్వీకరించిన టీజీఈఆర్సీ చైర్మన్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరం, 2025 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచడం లేదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ప్రకటించారు. సంస్థ ఆదాయానికి, అవసరానికి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం టారిఫ్ సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. పవర్ స్వాపింగ్ ఒప్పందాల(డిమాండ్ లేని సమయంలో మన విద్యుత్ ఆ రాష్ట్రాలకు, డిమాండ్ ఉన్న సమయంలో ఆ రాష్ట్రాల నుంచి విద్యుత్ మనకు అందించేలా) వల్ల టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.1614 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఈ ఒప్పందాల వల్ల పీక్ సీజన్‌లో యూనిట్ రూ.10 వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అదనపు భారం తగ్గిందన్నారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) చైర్మన్ డి.నాగార్జున్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ విచారణలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ సి. శ్రీనివాసరావు, విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, రైల్వే, హెచ్ఎంఆర్ఎల్, వాటర్‌బోర్డుతో పాటు పలు విభాగాల ప్రతినిధులు ఈ బహిరంగ విచారణలో పాల్గొన్నారు.

చిన్నయ్య సరితకు రూ. 5 లక్షల పరిహారానికి సంబంధించిన పత్రాలు ఇస్తున్న టీజీఈఆర్సీ చైర్మన్ డి.నాగార్జున్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ

కాగా, డబ్బులిస్తేనే పొలాల్లో విద్యుత్ స్తంభాలు వేస్తామని లైన్‌మెన్ తమని బెదిరిస్తున్నారంటూ ఈ బహిరంగ విచారణకు హాజరైన వనపర్తి గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పలువురు రైతులు టీజీఈఆర్సీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. డిస్కమ్‌లకు డీడీలు చెల్లించినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడం లేదని, వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీ చైర్మన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక, నిబంధనల ప్రకారం విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రియదర్శిని పేర్కొన్నారు.

2019 నాటి ఘటనకు తక్షణ పరిష్కారం..

బహిరంగ విచారణకు హాజరైన నారాయణ్‌పేట కోస్గి మండలానికి చెందిన చిన్నయ్య సరిత.. తన భర్త సంజీవరెడ్డి విద్యుత్ ప్రమాదంలో 2019లో మరణిస్తే ఇప్పటిదాకా పరిహారం ఇవ్వలేదని ఈఆర్సీ చైర్మన్‌కు వివరించింది. స్పందించిన చైర్మన్.. తక్షణమే పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో డిస్కం అధికారులు వెంటనే ఆ ఫైల్‌ను పంపించి రూ.5 లక్షల పరిహారానికి సంబంధించిన పత్రాలను చైర్మన్ చేతులమీదుగా సరితకు అందజేశారు.

సాక్షి

పొంచి ఉన్న 'ట్రూఅప్' భారం!

- ఆదాయ లోటు, ప్రభుత్వ సబ్సిడీ నిధుల మధ్య పొంతన లేదు
- లోటు భర్తీకి భవిష్యత్తులో ట్రూఅప్ చార్జీలు అనివార్యం
- అవసరానికి మించి పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు వద్దు
- ఈఆర్సీ బహిరంగ విచారణలో విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాలరావు
- పరిహారం చెల్లింపు, లైన్లు, టవర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి
- అధికారులకు కమిషన్ ఆదేశం

బహిరంగ విచారణలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ.
(ఇన్‌సెట్‌లో) ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు భవిష్యత్తులో ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఏ) ముప్పు పొంచి ఉందని విద్యుత్ రంగ నిపుణుడు ఎం.వేణుగోపాలరావు ఆందోళన వ్యక్తంచేశారు. రెండు డిస్కంలకు రూ.20,151 కోట్ల ఆదాయ లోటు ఉంటుందని అంచనా వేయగా, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీల కింద బడ్జెట్‌లో రూ.11,500 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. మిగతా లోటును పూడ్చుకునేందుకు ట్రూఅప్ చార్జీలు విధించాల్సి వస్తుందని తెలిపారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సమర్పించిన 2025-26 వార్షిక ఆదాయ అవశ్యకత(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణలో ఆయన తన వాదన వినిపించారు. డిస్కంల ఆర్థిక నష్టాలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల బకాయిల కలిపి రూ.98,053 కోట్లకు ఎగబాకాయని ఆందోళన వ్యక్తం చేశారు. గరిష్ట డిమాండ్ ఉండే సమయంలో పునరుత్పాదక విద్యుత్ అందుబాటులో ఉండదని, అందువల్ల తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన కనీస మొత్తం కంటే అధికంగా పునరుత్పాదక విద్యుత్‌ను కొనటం ఏమాత్రం సరికాదని అన్నారు. అలా చేస్తే గరిష్ట డిమాండ్‌ను తీర్చడానికి బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోళ్లకు అనవసర ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పునరుత్పాదక ఇంధన కొనుగోళ్లకు అడ్డగోలుగా ఒప్పందాలు చేసుకుంటే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించడానికి బ్యాకింగ్ డౌన్ చేసి నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఏడాది ఏకంగా 28,504 మిలియన్ యూనిట్ల (ఎంయూ) మిగులు విద్యుత్ ఉంటుందని డిస్కంలు అంచనా వేశాయని, అవసరం లేని ఈ విద్యుత్‌కు చెల్లించే ఫిక్స్‌డ్ చార్జీల భారం వినియోగదారులపై పడుతుందని అన్నారు. సమ్మతి తెలిపిన వినియోగదారులకే ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని సూచించారు. టైమ్ ఆఫ్ డే పేరుతో రాత్రి పూట విద్యుత్ వినియోగించే హెచ్‌టీ వినియోగదారులకు ఇస్తున్న రాయితీలను ఎత్తివేయాలని కోరారు. బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్ ఏర్పాటు చేస్తే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.11కి పెరిగిపోతుందని చెప్పారు.

వినతులు, ఫిర్యాదులు..

- రైల్వే ట్రాక్షన్ విద్యుత్ చార్జీలను హైదరాబాద్ మెట్రో రైలు కేటగిరీతో సమానంగా తగ్గించాలని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆర్.మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు.
- విద్యుత్ బిల్లులను నెల పూర్తికాక ముందే జారీ చేసిన సందర్భాల్లో సగటున 30 రోజుల వాడకాన్ని అంచనా వేసి టారిఫ్ శ్లాబులను వర్తింపజేస్తుండటంతో బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయని కిరణ్‌కుమార్ అనే వినియోగదారుడు ఫిర్యాదు చేశారు.
- విద్యుత్ ప్రమాదాల్లో మరణించి వారి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ప్రశ్నించారు. దరఖాస్తులు చేసుకోవడానికి నిర్దేశిత గడువు ఏమీ లేనప్పుడు గడువు పేరుతో దరఖాస్తులు ఎందుకు తిరస్కరిస్తున్నారని నిలదీశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో సంజీవరెడ్డి అనే వ్యక్తి 2019లో విద్యుదాఘాతంతో మరణిస్తే ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని అతడి భార్య సరిత ఫిర్యాదు చేయటంతో అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఇప్పించారు.
- కొత్త వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలతో పాటు లంచాలు ఇచ్చినా సకాలంలో జారీ చేయడం లేదని పలువురు రైతులు ఆరోపించారు. ఈ ఫిర్యాదులపై జస్టిస్ దేవరాజు నాగార్జున్ అక్కడికక్కడే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని వివరణ కోరారు.

లైన్లు, టవర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

పంట పొలాల్లో విద్యుత్ లైన్లు, టవర్ల ఏర్పాటు విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఈఆర్సీ చైర్మన్ ఆదేశించారు. నోటీసులు ఇవ్వకుండా, తమ సమ్మతి లేకుండా పొలాల్లో లైన్లు వేస్తున్నారన్న రైతుల ఫిర్యాదులపై వివరణ కోరారు. టవర్ ఏర్పాటు చేస్తే స్థలం మార్కెట్ విలువ తో పోల్చితే 200 శాతాన్ని, లైన్లు వేస్తే 30 శాతాన్ని పరిహారంగా ఇవ్వాలని జీవో ఉందని ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి వచ్చే సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్షేత్ర స్థాయిలోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని ఫారూఖీ హామీ ఇచ్చారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్
- ఈఆర్సీ బహిరంగ విచారణకు హాజరు

దిశ, తెలంగాణ బ్యూరో :

టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ఛార్జీల పెంపుపై శుక్రవారం హైదరాబాద్ ఎర్రగడ్డ లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ కార్యాలయంలో బహిరంగ విచారణ జరిగింది. ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ డి. నాగార్జున్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ విచారణలో టీజీ ఎస్పీడీసీఎల్ సంస్థ ఆదాయ అవశ్యకత, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై విచారించారు. బహిరంగ విచారణలో టీజీఎస్పీడీసీఎల్ జేఎండీ శ్రీనివాస్ తో కలిసి సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హాజరై మాట్లాడారు. ఈ ఏడాది విద్యుత్ ఛార్జీల పెంపునకు ఎటువంటి ప్రతిపాదనలు చేయడం లేదన్నారు. ముఖ్యంగా టారిఫ్ ప్రతిపాదనలను కమిషన్ ముందు ఉంచుతూ ఈ ఏడాది రెవెన్యూ గ్యాప్ రూ.9758 కోట్లుగా ఉందన్నారు. ఈ రెవెన్యూ గ్యాప్ ను ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీ చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ 17162 మెగావాట్లకు చేరుకున్నదని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ తరఫున డిప్యూటీ సెక్రటరీ ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యుత్ రంగ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతు సమకూరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల అభివృద్ధితో పాటు, వినియోగదారుల హక్కులు కాపాడటం ఈఆర్సీ ముఖ్య ఉద్దేశమని అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలానికి చెందిన వినియోగదారు చిన్నయ్యగారి సరిత భర్త సంజీవరెడ్డి 2019లో విద్యుత్ ప్రమాదంలో చనిపోయారని, ఇప్పటివరకు ఎక్స్ గ్రేషియా రాలేదని చైర్మన్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన చైర్మన్ వెంటనే రూ.5 లక్షల చెక్ ను జారీ చేశారు.

నవతెలంగాణ

విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రతిపాదన లేదు

ఎస్పీడీసీఎల్ ఆదాయం, రిటైల్ సరఫరాపై విచారణలో ఫరూఖి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్పీడీసీఎల్ ఆదాయం, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై ఈఆర్సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డి.నాగార్జున అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ విద్యుత్ నియంత్రణ భవన్‌లో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి, సి.శ్రీనివాస రావు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టారిఫ్ ప్రతిపాదనలను కమిషన్ ముందు ఫరూఖి పెట్టారు. ఈ ఏడాది విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించడం లేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది రెవిన్యూ గ్యాప్ రూ.9,758 కోట్లు ఉన్నట్టు తెలిపారు. ఈ రెవిన్యూ గ్యాప్ ను ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీ చేయాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ 17,162 మెగావాట్ల కు చేరుకున్నట్టు తెలిపారు.

దేశంలోని ఇతర విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ అగ్రిమెంట్ లు ప్రభుత్వం చేసుకుందన్నారు. పవర్ స్వాప్ అగ్రిమెంట్లతో ఎస్పీడీసీఎల్‌కు రూ.1,614 కోట్ల రూపాయలు ఆదా అవుతుందన్నారు. రూ. 578.88 కోట్లతో నెట్వర్క్ బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. పంపిణీ నష్టాలు11. 8.38 శాతానికి తగ్గాయన్నారు. పవర్ పర్చేస్ కాస్ట్ కూడా రూ 5.76 పైసలకు తగ్గించినట్టు చెప్పారు. పీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 1.55 శాతానికీ, డీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 5.70 శాతానికి తగ్గించినట్టు వివరించారు. ఈ విచారణలో వేణుగోపాల్ రావు, రైల్వే, హెచ్ఎంఆర్ఎల్, పలువురు విద్యుత్ రంగ నిపుణులు పాల్గొన్నారు.

Date: 22/03/2025, Edition: HYDERABAD MAIN, Page: 7
Source : https://epaper.navatelangana.com/

కరెంట్ చార్జీల పెంపు లేనట్టే

క్లారిటీ ఇచ్చిన డిస్కంలు

రెవెన్యూ లోటును భరించేందుకు సర్కారు గ్రీన్ సిగ్నల్

ప్రభుత్వ అంగీకార పత్రం అందించిన ఎనర్జీ డిప్యూటీ సెక్రటరీ

సదరన్ డిస్కం ఏఆర్ఆర్‌పై ఈఆర్‌సీ బహిరంగ విచారణ

విద్యుత్ పంపిణీ నష్టాలు తగ్గాయి: సదరన్ డిస్కం సీఎండీ

కరెంట్ షాక్ మరణాలు పెరుగుతున్నాయి.. ప్రమాదాలపై రిపోర్ట్ ఇవ్వాల్సిందే: ఈఆర్‌సీ చైర్మన్

హైదరాబాద్, వెలుగు:

కరెంట్ చార్జీలను పెంచడం లేదని రాష్ట్ర సర్కారు స్పష్టం చేసింది. డిస్కంల లోటును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చింది. దీంతో సామాన్యులపై కరెంట్ చార్జీల భారం తప్పినట్టయింది. శుక్రవారం హైదరాబాద్ లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్ ఆధ్వర్యంలో ఎస్పీడీసీఎల్ ఆదాయ అవసరాలు, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. మిగతా 4లో

కరెంట్ చార్జీల పెంపు లేనట్టే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా విద్యుత్ చట్టం 2003లోని 65వ నియమంలోని నిబంధనల ప్రకారం తెలంగాణ విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియదర్శిని తెలియజేశారు. 2025-26లో వినియోగదారులకు టారిఫ్ లో ఎలాంటి పెరుగుదల ఉండబోదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన హామీ రావడంతో విద్యుత్ చార్జీలు పెంచడం లేదని డిస్కంలు కూడా క్లారిటీ ఇచ్చాయి. ఇప్పటికే చార్జీల పెంపు ప్రతిపాదన లేదని నార్దర్న్ డిస్కం స్పష్టం చేయగా. తాజాగా శుక్రవారం ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ కూడా కరెంట్ చార్జీల పెంపు లేదని ప్రకటన చేశారు.

నష్టాలు తగ్గాయి: సదరన్ డిస్కం సీఎండీ

విద్యుత్ పంపిణీ నష్టాలు తగ్గాయని సదరన్ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూకీ తెలిపారు. ఈఆర్‌సీ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో కరెంట్ పీక్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరుకుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ అగ్రిమెంట్లు చేసుకున్నామని, వీటి ద్వారా ఎస్పీడీసీఎల్ కు రూ.1,614 కోట్లు ఆదా అవుతోందని చెప్పారు. డిస్కం పరిధిలో రూ.578.88 కోట్లతో నెట్ వర్క్ బలోపేతం చేశామని, ఫలితంగా విద్యుత్ పంపిణీ నష్టాలు 8.38 శాతానికి తగ్గాయన్నారు. పవర్ పర్చేస్ కాస్ట్ రూ.5.76కు తగ్గించినట్లు కమిషన్‌కు వివరించారు. పీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్ ను 1.55 శాతానికి, డీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్ ను 5.70 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ యూనిట్ సరాసరి రేటు రూ.3.53గా వున్నదని. ముమ్ముందు రూ.2కే అందుబాటులోకి వస్తుందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా ఇస్తున్న విద్యుత్‌కు ప్రభుత్వం నుంచి సబ్సిడీ నిధులు వసూలు చేస్తామన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల మధ్య సీతల అధ్యక్షతన ప్రతి సర్కిల్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. కాగా. సదరన్ డిస్కంకు ఈ ఫైనాన్షియల్ ఇయర్‌లో రూ.46,035 కోట్ల రెవెన్యూ అవసరాలు ఉండగా, ప్రస్తుత టారిఫ్ ల ద్వారా రూ.36,220 కోట్లు రెవెన్యూ వస్తోంది. ఇవికాకుండా క్రాస్ సబ్సిడీ సర్ చార్జీతో రూ.37 కోట్లు, అడిషనల్ సర్ చార్జీతో రూ.20 కోట్ల రెవెన్యూ వస్తోంది. అయినప్పటికీ రెవెన్యూ గ్యాప్ రూ.9,758 కోట్లుగా ఉండనుంది. ఈ రెవెన్యూ గ్యాప్‌ను ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీచేయనుంది.

రైతులకు నష్టపరిహారం అందట్లే..

బహిరంగ విచారణలో రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. కరెంట్ సరఫరా సమస్యలు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, కరెంట్ షాక్ తో రైతుల మరణాలు, మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం తదితర అంశాలను ఈఆర్సీ చైర్మన్ కు వివరించారు. విద్యుత్ షాక్ తో చనిపోయిన రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. జాతీయ రహదారులపై విద్యుత్ బల్బులు ఉండడంలేదని, దాని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగ నిపుణుడు ఎం వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. ఏఆర్ఆర్ రిపోర్టులు ఇవ్వడంలో డిస్కంలు ఏటా లేట్ చేస్తున్నాయని చెప్పారు. సోలార్ ఎనర్జీ వాడకం పెంచుకోవాలనుకున్నా స్టోరేజీ కాస్ట్ ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. విద్యుత్ సంస్థల్లో కరెంట్ ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళనవ్యక్తం చేశారు. రైతులు 24 గంటల ఉచిత కరెంట్ అడగడం లేదని, అంత అవసరం కూడా ఉండదన్నారు.

అప్పటికప్పుడే చెక్ అందజేశారు

బహిరంగ విచారణలో పాల్గొన్న చిన్నయ్యగారి సరిత మాట్లాడుతూ.. తన భర్త సంజీవ రెడ్డి 2019 లోకరెంట్ షాక్‌తో చనిపోయారని, పరిహారం ఇప్పటికీ రాలేదని ఈఆర్‌సీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తీవ్రంగా స్పందించిన చైర్మన్ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో అప్పటికప్పుడు ఫైల్ ను ప్రాసెస్ చేసి 5 లక్షల పరిహారాన్ని విడుదలచేస్తూ చైర్మన్ చేతుల మీదుగా చెక్‌ను అందించారు. బహిరంగ విచారణలో ఎస్పీడీసీఎల్ జేఎండీ శ్రీనివాస రావు, రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, విద్యుత్ రంగ సంస్థల అధికారులు, రైతులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై రిపోర్ట్ ఇవ్వాల్సిందే: ఈఆర్‌సీ చైర్మన్

బహిరంగ విచారణలో ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదం ఎలా జరిగింది? ఎలా మరణించారు? అనే వివరాలను నివేదికల్లో తప్పనిసరిగా మెన్షన్ చేయాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. ప్రమాదం సంస్థ నిర్లక్ష్యంతో జరిగిందా? ఉద్యోగి నిర్లక్ష్యంతో జరిగిందా? అనేది తెలియాలని స్పష్టం చేశారు. ఏఆర్ఆర్ పై డిస్కంల జాప్యంపై స్పందిస్తూ ఏఆర్ఆర్ ను స్టడీ చేసి సబ్‌మిట్ చేయడంలో ఈసారి ఆలస్యమైందన్నారు. పీక్ హవర్స్ లో కరెంట్ కొనుగోలు రేటు చాలా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని సదరన్ డిస్కం అధికారులు మిస్ అయినట్లున్నారని తెలిపారు. 2030 నాటికి కేంద్ర ప్రభుత్వం 30 శాతం సోలార్ విద్యుత్‌ను వినియోగించాలని భావిస్తోందని తెలిపారు.

వార్త

22 Mar 2025 - Page 7

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

ఈ యేడాది రెవెన్యూ గ్యాప్ రూ.9,758 కోట్లు

టిజిఇఆర్సీ విచారణలో ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

ప్రభుత్వం ఆర్థిక మద్దతు ఇస్తుంది: ఇంధన కార్యదర్శి ప్రియదర్శిని

హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన చేయలేదని ఆ సంస్థ సిఎండి మ ఉషారఫ్ ఫరూఖీ తెలిపారు. హైదరాబాద్‌లోని విద్యుత్ నియంత్రణ భవన్‌లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టిజిఈఆర్సీ) ఛైర్మన్ డా.జస్టిస్ నాగార్జున్ అధ్యక్షతన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై మొదలైన బహిరంగ విచారణలో ఫరూఖీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టారిఫ్ ప్రతిపాదనలను కమిషన్ ముందు ఉంచిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంపుదల లేకపోవడంతో ఈ ఏడాది రెవిన్యూ గ్యాప్ 9,758 కోట్ల రూపాయాలుగా ఉంటుందన్నారు. ఈ ఆదాయ, వ్యయాల మధ్య అంతరాయాన్ని ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీ చేయాలని ప్రతిపాదించినట్లు వివరించారు. ఇక రాష్ట్రంలో 17162 మెగావాట్లకు విద్యుత్ అత్యధిక డిమాండ్‌కు చేరుకున్న నేపథ్యంలో దేశంలోని ఇతర విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ అగ్రిమెంట్‌లు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ పవర్ స్వాప్ అగ్రిమెంట్‌ల వలన ఎస్పీడీసీఎల్‌కు 1,614 కోట్ల రూపాయలు ఆదా అవుతుందన్నారు. అలాగే 578.88 కోట్ల రూపాయల వ్యయంతో నెట్‌వర్క్ బలోపేతం చేస్తామని చెప్పారు. ఇక పంపిణీ నష్టాలు 8.38 శాతానికి తగ్గించినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో విద్యుత్ కొనుగోళ్ల ధర కూడా రూ 5.76 పైసలకు తగ్గించినట్లు తెలియచేవారు. అంతేకాకుండా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 1.55 శాతానికి, డైనమిక్ థర్మల్ రేటింగ్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 5.70 శాతానికి తగ్గించినట్లు తెలిపారు.

సర్కార్ ఆర్థిక మద్దతు: ఇంధన శాఖ

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను విద్యుత్ చట్టం 2003 లోని 65 నిబంధనల ప్రకారం తెలంగాణ విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ ఏస్. ప్రియదర్శిని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున బహిరంగ విచారణలో పాల్గొన్న డిప్యూటీ సెక్రటరీ గౌరవ కమీషన్ ఆమోదించే టారిఫ్ ఉత్తర్వును అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏ కేటగిరికి చెందిన విద్యుత్ విని యోగదారులకు టారిఫ్‌లో ఎటువంటి పెరుగుదల ఉండబోదని వివరణ ఇచ్చారు.

ఆంధ్రప్రభ
Estd 1928
www.prabhanews.com
Journalism first!

రైతుల కోసం ప్రత్యేక డ్రైవ్

● వారి సూచనలు, సలహాలతో మెరుగైన సేవలు ● ప్రశాంతంగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ విచారణ ● అనేక అంశాలు లేవనెత్తిన పలువురు వినియోగదారులు ● సమాధానం చెప్పిన సీఎండీ ఫరూఖీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం బహిరంగ విచారణలో భాగంగా పలువురు లేవనెత్తిన అభ్యంతరాలకు సీఎండి ముషారఫ్ ఫరూఖి సమాధాన మిచ్చారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా, పర్యావరణ హితం కోసం రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ యూనిట్ సరాసరి రేటు రూ.3.53గా ఉందని, మున్ముందు దాని ధర రూ.2 కే అందుబాటు లోకి వస్తుందన్నారు. పవర్ స్వాప్ అగ్రిమెంట్‌ల ద్వారా ఇతర రాష్ట్రాల నుండి విద్యుత్‌ను తీసుకుంటున్నామని, దీని వలన పీక్ సీజన్ లో యూనిట్‌కు రూ 10 వెచ్చించి కొనుగోలు చేయాల్సిన అదనపు భారం తగ్గిందన్నారు. మొత్తం మీద ఈ పవర్ స్వాపింగ్ మూలంగా సంస్థకు రూ. 1614 కోట్ల ఆదా అయ్యాయన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా అందజేస్తున్న విద్యుత్‌కు ఒక యూనిట్‌కు అయ్యే కాస్ట్ ఆఫ్ సర్వీస్‌ను బట్టి ప్రభుత్వం నుండి వసూలు చేయాలని కొంత మంది కోరారు. అయితే అలా చేయడం కమిషన్ నిర్ధారించిన టారిఫ్ ఆర్డర్‌కు విరుద్ధమని, గృహజ్యోతికి ఇస్తున్న విద్యుత్‌కు ప్రభుత్వం నుండి సబ్సిడీని వసూలు చేస్తామన్నారు. వ్యవసాయ వినియోగదారులకు మరింతగా దగ్గరయ్యే ఉద్దేశ్యంతో వచ్చే సోమవారం నుండి శుక్ర వారం వరకు 10:30 నుండి 2:00 గంటల వరకు చీఫ్ ఇంజినీర్ల అధ్యక్షతన ప్రతి సర్కిల్‌లో ప్రత్యేకమైన డ్రైవ్‌ను నిర్వహిస్తామని చెప్పారు. ఈ డ్రైవ్‌లో రైతుల నుండి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని, దాన్ని ప్రామాణికంగా తీసుకొని సంస్థ అందించే సేవల్లో అవసరమైతే తగు మార్పులు చేస్తామని సీఎండీ అన్నారు. నారాయణ్‌పేట్, కొస్గి మండలం నుండి చిన్నయ్యగారి సరిత మాట్లాడుతూ, తన భర్త సంజీవ రెడ్డి 2019లో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, ఇంతవరకు పరిహారం రాలేదని విన్నవించారు. దీనిపై స్పందించిన చైర్మన్ వెంటనే పరిహారానికి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు డిస్కం అధికారులు యుద్ధప్రాతిపదికన ఆ ఫైల్‌ను ప్రాసెస్ చేసి రూ. 5 లక్షల చెక్ జారీ చేశారు.

No move to hike power tariff, govt set to bear subsidy brunt

HANS NEWS SERVICE
HYDERABAD

THE Telangana government and the DISCOMS have no proposal to hike power tariff in 2025-2026 financial year. The officials clarified in the public hearing conducted by Telangana Electricity Regulation Commission here on Friday that the government will bear all power subsidy burden without increasing the power tariff.

In the public hearing conducted, the Commission Chairman Justice D Nagarjuna, TGSPDCL Chairman and Managing Director Musharraf Farooqui and JMD C Srinivasa Rao said that the revenue gap is expected to be around Rs 9,758 crore due to increased free power consumption in farming and domestic consumer sectors. He said that the government itself will fill this revenue gap through subsidy and it was the reason for discom not proposing the tariff hike.

Stating the highest demand in the state has reached 17,162 MW this year and that it will go up during the peak summer, the CMD said that the government has entered into power swap agreements with other power companies in the country. As a result, the TGSPDCL saved Rs 1,614 crore due to power swap agreements. He also explained the measures to strengthen the power distribution which included strengthening of the network at a cost of Rs 578.88 crore, distribution losses reduced to 8.38 per cent, power purchase cost reduced to Rs 5.76 paise and reduced the failure rate to 1.55 percent and the DTR failure rate to 5.70 percent. S Priyadarshini, Deputy Secretary, Energy Department, informed the Commission that the state government is committed to provide necessary financial support to the Telangana Power Companies for the financial year 2025-26 as per the provisions of Rule 65 of the Electricity Act, 2003, in accordance with the tariff order approved by the Commission. She said that the government would not increase power tariff for any category of consumers in the financial year 2025-26 and that it will provide necessary financial support to the power sector companies.

Namaste Telangana - 22.03.2025

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నయ్!

- డీడీలు కట్టి నెలలు దాటినా ఇచ్చే దిక్కులేదు
- కరెంట్ పోతున్నది.. పంటలు ఎండుతున్నయి
- సిబ్బందితోనే సమస్యలు.. ప్రతీ పనికి పైసలు
- ఈఆర్సీ విచారణలో గోడు వెళ్లబోసుకున్న రైతులు
- ఈసారి చార్జీల పెంపు ఆలోచన లేదన్న సీఎండీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ): కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియడంలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే డీడీలు కట్టి నెలలు గడిచినా ఇచ్చే పరిస్థితే లేదని వివిధ జిల్లాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ కల్యాణ్‌నగర్‌లోని విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో టీజీఎస్పీడీసీఎల్ 2025-26కోసం సవరించిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై ఈఆర్సీ చైర్మన్ దేవరాజు నాగార్జున అధ్యక్షతన జరిగిన బహిరంగ విచారణలో గోడు వెళ్లబోసుకున్నారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని, లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్థాయిలో విద్యుత్‌శాఖ అధికారులు ఏ చిన్న పని చేయాలన్నా.. డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పంట పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని రిపేర్‌షెడ్‌కు తరలించే పనిని కూడా రైతుల మీదనే వేస్తున్నారని, ఖర్చులు కూడా అన్నదాతలపైనే మోపుతున్నారని నాగర్‌కర్నూల్‌కు చెందిన రైతులు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు బాధ్యతను రైతులపై వేయడం వల్ల ప్రమాదానికి గురై రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డు పక్కకు మార్చాలని డిమాండ్ చేశారు. కరెంట్ షాక్‌తో చని

జస్టిస్ దేవరాజు నాగార్జున

పోయిన రైతుల కుటుంబాలకు పరిహారం అందడంలేదని, జాతీయ రహదారులపై వీధి దీపాలు సరిగా ఉండడంలేదని, దాని కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయని కొందరు రైతులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు.

చేతులెత్తేస్తున్న అధికారులు

రాష్ట్రంలో అత్యధికంగా విద్యుత్ సమస్యలతో నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలు కొట్టుమిట్టాడుతున్నాయని ఎస్పీడీసీఎల్ అధికారులే తమకు చెబుతున్నారంటూ ఆయా జిల్లాల నుంచి వచ్చిన రైతులు చెప్పారు. తాము బావుల దగ్గరకు వెళ్లే పరిస్థితే లేదని, పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మీటర్లు ఇవ్వకుండా పెనాల్టీల పేరుతో అధికారులు ఇబ్బంది పెడుతున్నారంటూ రైతులు ఈఆర్సీకి ఫిర్యాదు చేశారు. బహిరంగ విచారణకు హాజరైన వారిలో ఎక్కువమంది విద్యుత్తు సిబ్బందితో సమస్యలు ఉన్నాయని చెప్పారు. విచారణలో రైల్వే హెచ్ఎంఆర్ఎల్ వేణుగోపాల్‌రావు, డిస్కమ్ జేఎండీ శ్రీనివాసరావు, పలువురు సీజీఎంలు, సీఈలు, ఎస్ఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ్‌పేట జిల్లా కోస్గి మండలం నుంచి వచ్చిన సరిత అనే మహిళ తన భర్త సంజీవరెడ్డి విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడని, పరిహారం అందలేదని ఈఆర్సీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎక్స్‌గ్రేషియాకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలంటూ డిస్కమ్ అధికారులను చైర్మన్ ఆదేశించారు. డిస్కమ్ అదికారులు యుద్ధప్రాతిపదికన ఫైల్ ప్రాసెస్ చేసి రూ.5లక్షలకు చెక్ సిద్ధం చేయగా నాగార్జున చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేయాలి: జస్టిస్ దేవరాజు నాగార్జున , ఈఆర్సీ చైర్మన్

విద్యుత్ సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున చెప్పారు. ఎక్కడ సమస్యలు అక్కడే పరిష్కారమైతే ప్రత్యేక సమావేశాల అవసరమే ఉండదని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

చార్జీల పెంపు ప్రతిపాదన లేదు: ముషారఫ్ అలీ ఫారుఖీ, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

2025-26 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ పెంపు ప్రతిపాదన లేదని, కరెంట్ చార్జీలలో ఎలాంటి మార్పు ఉండదని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీ తెలిపారు. టైమ్ ఆఫ్ డే ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే వినియోగదారులకు మాత్రం సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు ఉంటుందని వెల్లడించారు.

ఎండిన చేనులో ఎడ్లు కట్టేసి వచ్చిన

డీడీ కట్టి ఎన్ని నెలలైనా ట్రాన్స్‌ఫార్మర్లు వస్తలేవు. సిబ్బందిని అడిగితే పట్టించుకుంటలేరు. పదహారునెలలైనా ఇంకా రాలేదు. వ్యవసాయమెట్ల కావాలె. పొలాలు ఎండిపోయినయి. పొలంలో ఎడ్లు కట్టేసి ఇక్కడికి వచ్చిన.

- కిష్టయ్య, షాబాద్

24 గంటల కరెంటా.. ఎక్కడ వస్తున్నది?

నా మామిడి తోట దగ్గర పాత పోల్‌లు, లైన్ల మార్పిడి విషయంలో 2022లో ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు మాకు బడ్జెట్ సాంక్షన్ చేశారు. కానీ ఇప్పటివరకు మెదక్‌జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో ఆ సమస్యే పరిష్కారమవడం లేదు. డీడీలు కట్టి నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్లు రావడం లేదు. గద్దెలు కాంట్రాక్టర్లే కట్టియ్యాలి. కానీ రైతులే కట్టుకోవాలని అధికారులు చెప్పున్నరు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని ప్రభుత్వం చెప్పున్నది. కానీ క్షేత్రస్థాయిలో కరెంట్ ఎప్పుడు ఉంటదో, ఎప్పుడు పోతదో తెలియదు.

- అనిల్‌కుమార్, మెదక్ జిల్లా

Eenadu - 22.03.2025

వచ్చే ఏడాది కరెంటు ఛార్జీల పెంపు లేదు

- **ఈఆర్‌సీ విచారణలో తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం**

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26) ఏ కేటగిరీ వినియోగదారులకూ కరెంటు ఛార్జీలను పెంచట్లేదని, విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ఏర్పడే ఆర్థికలోటు తీర్చేందుకు అవసరమైన నిధులు బడ్జెట్ ద్వారా సమకూరుస్తామని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)కి ప్రభుత్వం తెలిపింది. వచ్చే ఏడాదికి కరెంటు ఛార్జీల సవరణపై డిస్కంలు గత నవంబరులో సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్‌ఆర్) నివేదికపై ఈఆర్‌సీ కార్యాలయంలో ఛైర్మన్ జస్టిస్ నాగార్జున శుక్రవారం బహిరంగ విచారణ జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన ఇంధనశాఖ ఉప కార్యదర్శి ప్రియదర్శిని మాట్లాడుతూ.. విద్యుత్ చట్టంలోని 65వ నిబంధన ప్రకారం విద్యుత్ పంపిణీ సంస్థలకు అవసరమైన ఆర్థిక మద్దతును సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఛార్జీలను పెంచడానికి డిస్కంలకు అనుమతి ఇవ్వవద్దని కోరారు. దక్షిణ తెలంగాణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ మాట్లాడుతూ.. ఏఆర్‌ఆర్‌లో డిస్కంలు ఇచ్చిన ప్రతిపాదనలను తెలిపారు. "వచ్చే ఏడాది కరెంటు ఛార్జీల పెంపును ప్రతిపాదించడం లేదు. దక్షిణ డిస్కంకు ఆదాయ, వ్యయాల మధ్య రూ.9,758 కోట్ల లోటు ఏర్పడుతోంది. దానిని ప్రభుత్వమే రాయితీ పద్దు ద్వారా భర్తీ చేయాలి.

ఈఆర్‌సీ విచారణలో వివరాలు వెల్లడిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ గరిష్ఠ డిమాండు 17,162 మెగావాట్లకు చేరుకుంది. నిరంతర కరెంటు సరఫరాకు దేశంలోని ఇతర విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ ఒప్పందాలు చేసుకున్నాం. వీటితో డిస్కంలకు రూ.1,614 కోట్లు ఆదా అవుతాయి. డిస్కం పరిధిలో రూ.578.88 కోట్ల వ్యయంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం" అని తెలిపారు. ఈ విచారణలో ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, పలువురు అధికారులు, రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు.

వ్యవసాయ కనెక్షన్లను త్వరగా ఇవ్వడం లేదు: రైతులు

వనపర్తి జిల్లా బుద్దారం గ్రామానికి చెందిన రైతులు బాలయ్య, బుచ్చన్న, సహదేవ్, నాగేంద్రం, చెన్నూరు గ్రామానికి చెందిన వెంకటయ్య, చిన్నగుంటపల్లికి చెందిన చిన్నయ్య తదితరులు మాట్లాడుతూ.. తాము రుసుం చెల్లించినా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరగా ఇవ్వడం లేదని, మోటార్ల వరకూ స్తంభాలు, లైన్లు వేయడం లేదని, చేతికందేలా తీగలు వేలాడుతున్నా సరిచేయడం లేదని వాపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వెంటనే మార్చడం లేదని చెప్పారు. స్థానిక విద్యుత్ లైన్‌మెన్ లంచాలిస్తే తప్ప ఏ పనీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల మధ్యలో నుంచి విద్యుత్ లైన్లు వేయడం వల్ల తమ భూములకు ధరలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల సేవా కేంద్రాలు అవినీతికి అడ్డాలుగా మారాయని వినియోగదారులు ఫిర్యాదు చేశారు.

అప్పటికప్పుడు రూ.5 లక్షలు అందజేత

నారాయణపేట్ జిల్లా కోస్గి మండలం నుంచి ఈ విచారణలో పాల్గొన్న చిన్నయ్యగారి సరిత మాట్లాడుతూ.. తన భర్త 2019లో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, దానికి సంబంధించిన ఎక్స్‌గ్రేషియా ఇప్పటి వరకు రాలేదని ఛైర్మన్ జస్టిస్ నాగార్జున దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఆయన వెంటనే పరిహారం అందించటానికి ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో డిస్కం అధికారులు యుద్ధప్రాతిపదికన రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ఛైర్మన్ చేతుల మీదుగా బాధితురాలికి చెక్కును అందజేశారు.